క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన విజయలక్ష్మికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.60 వేలు మంజూరు కాగా, సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఆయన వెంట నాయకులు రవీందర్‌రావు, మగ్రిపల్లి శ్రీనివాస్‌గౌడ్, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

లత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామానికి చెందిన పోగుల రాజేశం కూతురు లత అత్తింటి వేధింపులు భరించలేక మృతిచెందగా, లత కుటుంబాన్ని సోమవారం రాత్రి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించారు. లత మృతిపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి పొలం బాట



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ నవీన్

రాయికల్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ట్రాన్స్‌కో ఏఈ నవీన్ మండలంలోని అయోధ్య, ఉప్పుమడుగు గ్రామాల్లో రైతులతో కలిసి పొలం బాట పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయ మోటార్ల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లైన్‌మెన్ గంగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



ధాన్యం బస్తాలు పరిశీలిస్తున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని తహసీల్దార్ ప్రసాద్ సిబ్బందిని కోరారు. సోమవారం మండలంలోని కేశాపూర్, ఎర్దండి, మూలరాంపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు తీసుకవచ్చిన ధాన్యం తేమశాతం పరిశీలించి వెంటనే తూకం వేసి లారీల్లో రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. కేంద్రాల్లో ధాన్యం నిలువలు ఉంచకూడదని, రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి



పడాల తిరుపతిని సన్మానిస్తున్న ఎంఈవో

రాయికల్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివినప్పుడే పరీక్షల్లో అధిక మార్కులు సాధించవచ్చని కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ పడాల తిరుపతి అన్నారు. సోమవారం రాయికల్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివినప్పుడే ర్యాంకులు సాధిస్తారని, నాణ్యమైన విద్యతోనే పోటీపరీక్షల్లో రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రాఘవులు, ఉపాధ్యాయులు పడాల రమేశ్, శివనందం, గంగాధర్, శ్రీకాంత్, సత్యనారాయణ, మల్లేశం, నాగరాజు పాల్గొన్నారు.

సిరికొండలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు నిధులు మంజూరు

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు రూ. 2.25 కోట్లు మంజూరు చేస్తూ ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సిరికొండలో విద్యుత్‌సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు నెలరోజుల క్రితం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి విన్నవించారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రూ. 2.25 కోట్లు మంజూరు చేస్తూ విద్యుత్ సంస్థ ఎం.డీ క్రాంతివరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సబ్‌స్టేషన్ మంజూరు పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

కలగానే వాల్గొండ పర్యాటక కేంద్రం

- రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి అంతంత మాత్రమే
- అస్తవ్యస్తంగా మురుగుకాలువలు
- జాడేలేని డబుల్ బెడ్‌రూం ఇండ్లు
- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న వాల్గొండ బ్యారేజీ నిర్మాణం



వాల్గొండలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం

మల్లాపూర్: మండలంలోని వాల్గొండ గ్రామం గోదావరినది తీరమున కొలువుదీరిన ఉత్తర ముఖ ద్వారం కలిగిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీరామలింగేశ్వర ఆలయంతో ప్రసిద్ధిగాంచిన గ్రామం.

కానీ ఆ గ్రామం రెండు దశాబ్దాలకు పైగా పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ అందిస్తున్న విన్నపాలు బుట్టదాఖలు అవుతున్నాయే తప్పా.. పర్యాటక కేంద్రంగా మారడం లేదు. ఇంతే కాకుండా వాల్గొండలో అనేక సమస్యలు తిష్టవేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామంలో ప్రధానంగా తాగునీటి సరఫరా, పారిశుధ్య పనుల నిర్వహణ, అంతర్గత రోడ్ల అభివృద్ధి, వాల్గొండ–గొర్రెపల్లికి బీటీరోడ్డు, వ్యవసాయానికి సాగు, ప్రజలకు తాగు నీరందించేందుకు గోదావరి నదిపై బ్యారేజీ కమ్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం వంటి సమస్యల ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

గ్రామ ప్రధాన సమస్యలు....

1.గోదావరినదిపై ఆనకట్ట నిర్మించి చెరువులు నింపడంతో పాటు సాగుకు నీరందించాలి.

2.వాల్గొండ శివారులోని గోదావరినది తీరాన కొలువుదీరిన శ్రీ రామలింగేశ్వర ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి.

3.గ్రామపంచాయితీ పరిధిలో అంతర్గత రహదారుల్లో 60 శాతం సీసీరోడ్లు, 40 శాతం మురుగు కాలువలు నిర్మించాల్సి ఉంది.

4.గోదావరి నదిపై బ్యారేజీ, రోడ్డు కమ్ బ్రిడ్జిని నిర్మిస్తే ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో రవాణా పరంగా అభివృద్ధి చెందుతుంది.

5. శిథిలావస్థకు చేరిన డ్రైయినేజీలను తొలగించి కొత్తవి నిర్మించడం, అంతర్గత రహదారులపై మురుగునీరు నిల్వ లేకుండా చూడాలి.

6.ప్రభుత్వ పాఠశాలలో సిబ్బంది కొరత ఉంది. వెంటనే ఖాళీలుగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలి.

7.మిషన్‌భగీరథ పనులు త్వరగా పూర్తిచేసి గ్రామంలో ఇంటింటికీ తాగునీరందించాలి.

8.వాల్గొండలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. అధికారులు కాంట్రాక్టర్లతో డబుల్ నిర్మాణాలు ప్రారంభింపచేసి అర్హులైన వారికి అందించాలి.

మల్లాపూర్ : వాల్గొండ గ్రామ ప్రొఫైల్ :

జనాభా	2,047
పురుషులు	989
స్త్రీలు	1058
ఓటర్లు	1114
వార్డులు	8
కుటుంబాల సంఖ్య	580

గోదావరినదిపై బ్యారేజీ నిర్మించాలి



వాల్గొండతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు తాగు, సాగునీరు అందించేందుకు గ్రామశివారులోని గోదావరినదిపై బ్యారేజీని నిర్మించాలి. దీంతో ఆయా గ్రామాల్లోని చెరువుల్లో జలకళను సంతరించుకోవడంతో పాటు అన్ని అవసరాలు తీరుతాయి. గ్రామంలో సీసీరోడ్లు, డ్రైయినేజీల నిర్మాణంతో పాటు వాల్గొండ–గొర్రెపల్లి రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయాలి

– పందిరి నాగరాజు, వాల్గొండ

పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి



వాల్గొండ శ్రీ రామలింగేశ్వర ఆలయం ఉత్తరముఖ ద్వారం కలిగిన ఏకైక త్రికూటాలయంగా ప్రసిద్ధి పొందింది. శ్రీ రామనవమి రోజున పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి సీతారాముల కల్యాణాన్ని తిలకించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి.

– క్యాతం సుజాత, మాజీ ఎంపీటీసీ, వాల్గొండ

సీఎం సహాయనిధి పేదలకు వరం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: సీఎం సహాయ నిధి పేదలకు వరమని, ఆరోగ్యశ్రీ సేవలు పొందడం ప్రజల హక్కు అని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఇందిరాభవన్‌లో సారంగాపూర్,బీర్‌పూర్, రాయికల్ మండలాలకు చెందిన 206 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా దివంగత సీఎం వైఎస్‌ఆర్ హయాంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్య సేవల పరిమితిని రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. ప్రజలు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్య సేవలు పొందాలని ఇది తమ హక్కుగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మసర్తి రమేశ్, జితేందర్ యాదవ్, కొండ్ర రాంచంద్రారెడ్డి, గోపు రాజిరెడ్డి, ఎన్నం మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద లత మృతి కారకులను కఠినంగా శిక్షించాలి

సారంగాపూర్: అత్తింటి వేధింపులకు బలైన చంద లత మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రేచపల్లిలో చంద లత కుటుంబాన్ని ఆయన పరామర్శించి ఈ విషయంపై ఎమ్మెల్సీ అక్కడి పోలీసులతో మాట్లాడారు. నిందితులు ముగ్గురిపై పోలీసులు హత్యానేరం కేసు నమోదు చేశారని తెలిపారు. నిందితులకు కఠినశిక్ష పడేలా చూడాలని పోలీసులను కోరారు.

పోగుల రాజేశం విడుదలకు కోర్టు నిరాకరణ

కాగా లత తండ్రి పోగుల రాజేశం మావోయిస్టులకు సహకరిస్తున్నాడని ఎన్ఐఏ 4 ఫిబ్రవరిలో అరెస్టు చేసి చత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్‌లో ఉంచారు. కూతురు అంత్యక్రియలు నిర్వహించేందుకు రాజేశం విడుదల కోసం కోర్టును ఆశ్రయించారు. కాగా కోర్టు రాజేశం బెయిల్‌ను తిరస్కరించినట్లు తెలిసింది. దీంతో రాజేశం తన కూతురును కడసారి చూసుకోవడానికి వీలు లేకుండా పోయింది.

అంగన్‌వాడీ ఆయాలకు పదోన్నతి



పదోన్నతి పత్రాలు అందిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: నియోజకవర్గంలోని గొల్లపెల్లి వెంగలాయిపేట, బతికెపెల్లి, లింగాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలుగా పని చేస్తున్న వారికి అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతులు లభించాయి. ఈసందర్భంగా సోమవారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా పదోన్నతుల పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారి నరేశ్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే సంజయ్ పాదయాత్ర సిగ్గుచేటు'

మెట్‌పల్లి: ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాదయాత్ర చేయడం సిగ్గుచేటని పీసీసీ సభ్యుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. సోమవారం మెట్‌పల్లిలో మాట్లాడారు. కోరుట్ల నుంచి జగిత్యాల వరకు ఆయన చేపట్టిన పాదయాత్ర రైతుల కోసం కాదని, ఎమ్మెల్యే కుటుంబం ప్రజాధనాన్ని కొల్లగొట్టి తిన్నది అరగక చేస్తున్న అజీర్తి యాత్ర అని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో చక్కెర ఫ్యాక్టరీ మూసివేసినప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న విద్యాసాగర్‌రావు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఆయన కుమారుడు ఎమ్మెల్యే సంజయ్ రైతుల కోసం పాదయాత్ర చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

'పబ్లిసిటీ కోసమే పాదయాత్ర'

మెట్‌పల్లిరూరల్: కేవలం పబ్లిసిటీ కోసమేనని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాదయాత్ర చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ ప్రవీణ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో తప్పా,తాలు పేరుతో మిల్లర్లతో కుమ్మక్కై బీఆర్‌ఎస్ రైతులను మోసం చేసిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని విమర్శించారు. కాంగ్రెస్ రైతు ప్రభుత్వమన్న ఆయన, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతుందన్నారు.

'పాదయాత్ర ఎందు కోసం..'

కోరుట్ల: పాదయాత్ర ఎందు కోసం చేస్తున్నారో.. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కే తెలియాలని కాంగ్రెస్ నాయకుడు చెన్నమనేని శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్ని సంక్షేమ పథకాలు అందజేస్తుండగా ఓర్వలేక రైతులను మభ్యపెట్టి పాదయాత్ర, ధర్నాలు అనడం పనికిమాలిన చర్య అన్నారు. చక్కెర ఫ్యాక్టరీ తెరిపించడంలో అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, ఇప్పటి ఎమ్మెల్యే సంజయ్‌లు విఫలమయ్యారని ఆరోపించారు.

గుండేటి రాజుకు తెలంగాణ టాలెంట్ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న గుండేటి రాజు

జగిత్యాలటౌన్: తెలంగాణ టాలెంట్ ఇన్‌స్పిరేషన్ అవార్డ్స్ 2024, మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మైనార్టీస్ వెల్ఫేర్ డే సెలబ్రేషన్స్ సందర్భంగా జగిత్యాల యునైటెడ్ సొసైటీ, మైక్రో అడ్వాన్స్‌డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో నిష్ణాతులైన సాహితి వేత్తలు, ఉర్దూ సాహితీ వేత్తలు, కళాకారులకు అందజేస్తున్నారు. ఈ పురస్కారాల్లో భాగంగా జగిత్యాలకు చెందిన కళాశ్రీఆర్ట్స్ థియేటర్స్ అధినేత గుండేటి రాజుకు జగిత్యాల ఏఆర్ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్, తెలంగాణ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ తారిక్ అన్సారీ చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహ్మద్ ఖాన్‌జియా, ప్రముఖ సినీ గాయకులు ప్రణయ్‌కుమార్, ప్రముఖ ఉర్దూ కవయిత్రి సాజిదాఖాన్ తదితరులు పాల్గొన్నారు. రాజుకు అవార్డు రావడం పట్ల పలువురు కవులు, కళాకారులు, సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

పేద యువతి పెళ్లికి సత్యసాయి సేవా సమితి చేయూత

జగిత్యాలటౌన్: నిరుపేద యువతి వివాహానికి సత్యసాయి సేవా సమితి అండగా నిలిచింది. చిన్నాపూర్ గ్రామానికి చెందిన గోనే రాజయ్య కూతురు నవిత వివాహం నిశ్చయం కాగా, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబం సత్యసాయి సేవాసమితి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన సేవాసమితి ప్రతినిధులు సోమవారం నవిత వివాహానికి బంగారు మంగళసూత్రం, వెండి మెట్టెలు, పెళ్లి చీర, మంగళహారతి సెట్, కన్యాదానం తాంబూలం, చెంబు, స్టీల్ బిందె, ప్లేట్లు, గ్లాసులు రూ.14 వేల విలువైన వస్తు సామగ్రితో పాటు 25 కేజీల బియ్యం అందజేసినట్లు సేవాసమితి కన్వీనర్ బట్టు రాజేందర్ తెలిపారు. కార్యక్రమంలో గుండ రాజశేఖర్, సామ సునీల్, తొడుపునూరి శ్రీనివాస్,రాంనారాయణ, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో రెండు రోజులపాటు ప్రత్యేక ఓటరు నమోదు చేపట్టగా.. 159 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వినోద్ సోమవారం తెలిపారు. కొత్తగా ఓటుహక్కు కోసం 115 మంది, తప్పుల సవరణకు 36 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. 8 మందిని తొలగించినట్లు తెలిపారు. ఈ మేరకు బీఎల్వోలకు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

అమ్మవారి ఒడిబియ్యం అన్నదానం

ధర్మపురి: దుర్గామాత అమ్మవారికి సమర్పించిన ఒడి బియ్యంను సోమవారం వండి భక్తులకు అన్నదానం చేశారు. ధర్మపురి పట్టణంలో నవదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో గత కొన్నేళ్ల నుంచి దసరా నవరాత్రోత్సవాలను అత్యంత వైభవంగా జరిపిస్తున్నారు. ఉత్సవాల్లో భక్తులు అమ్మవారికి సమర్పించిన ఒడి బియ్యంను నవదుర్గా సేవాసమితి వారి ఆధ్వర్యంలో సోమవారం వండి అక్కపెల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో వందలాది మంది భక్తులకు మహా అన్నదానం చేశారు.

నత్తనడకన కుటుంబ సర్వే..

మల్యాల: మండలంలో ఇంటింటా సమగ్ర కుటుంబ సామాజిక సర్వే నత్తనడకన సాగుతోంది. ఒక్కో ఇంటి వద్ద ఎన్యూమరేటర్లు అరగంటకుపైగా సమయం పడుతోంది. మండలంలో 15 వేల కుటుంబాలకుపైగా ఉండగా, మూడు రోజుల్లో సుమారు 2000 ఇళ్లలో సర్వే పూర్తిచేశారు. సోమవారం మల్యాల, ముత్యంపేట గ్రామాల్లో ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీణ్ సర్వేను పరిశీలించారు.

గల్ఫ్ కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెందిన పాలకుర్తి అశోక్‌గౌడ్ ఇటీవల మస్కట్‌లో గుండెపోటుతో మృతిచెందగా, సోమవారం మస్కట్‌గ్రూప్ సభ్యులు రూ.10 వేల ఆర్థికసాయం కుటుంబ సభ్యులకు అందజేశారు.

రైతు పాదయాత్ర విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న దావ వసంత

రాయికల్: రైతు సమస్యల సాధనకు కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ చేపట్టే రైతు పాదయాత్రను కార్యకర్తలు విజయవంతం చేయాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత కోరారు. సోమవారం రాయికల్ పట్టణంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రైతుపాదయాత్రకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పేర్కొన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అనిల్, మండల అధ్యక్షు డు బర్కం మల్లేశం, మహిళ అధ్యక్షురాలు స్పందన తదితరులు పాల్గొన్నారు.



సారంగాపూర్: మండలంలోని సారంగాపూర్, బట్టపల్లి, పోతారం గ్రామాల మధ్య రహదారిపై పలు ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయి. బొల్లమ్మబోరు శివారుల్లో అత్యంత ప్రమాదకర మూలమలుపు ఉంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఆదిత్య,ఏఈ ఆర్‌అండ్‌బీ,సారంగాపూర్, సెల్ నంబర్: 944081883

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

మత్స్యకారుల అభివృద్ధికి మరింత కృషి



కొండాపూర్ చెరువులో చేపపిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొండగట్టు: మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల మండలం కొండాపూర్‌లో మత్స్యకారులకు సోమవారం చేప పిల్లల పంపిణీ చేసి చెరువులోకి వదిలారు. మండలంలోని రామారావుపేటలో పోచమ్మ,సార్గమ్మల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలువేరీ నారాయణ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ గడ్డం జీవన్ రెడ్డి, నాయకులు గుడి మల్లిఖార్జున్ రెడ్డి,పిడుగు ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సుస్థిరాభివృద్ధి



మాట్లాడుతున్న కమిషనర్ చిరంజీవి

జగిత్యాల: విద్యతోనే సుస్థిరాభివృద్ధి సాధ్యమని జగిత్యాల మున్సిపల్ కమిషనర్ చిరంజీవి అన్నారు. జాతీయ విద్య దినోత్సవం పురస్కరించుకుని సోమవారం ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఈ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ప్రతీ విద్యార్థి ఉన్నత చదువుల కోసం ఎంతో కృషి చేయాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, రాజు, మధుకర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

జగిత్యాల: భారత మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయ సాధనకు కృషి చేయాలని ప్రిన్సిపల్ అలియా మక్సూద్ అన్నారు. సోమవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి తిరుపతిరెడ్డి, తిరుపతి, సునీత, సమేర, మాజీద్, సాజిద్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో సోమవారం మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతితో పాటు మైనార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ షాకీర్, మర్కజీ ఇంతేజామీ కమిటీ అధ్యక్షులు ఖుత్బొద్దీన్, తదితరులున్నారు.

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతిలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.కార్యక్రమంలో కరస్పాండెంట్ మచ్చ గంగాధర్, డైరెక్టర్ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసు కళాబృందం ప్రదర్శన

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కండ్లపల్లి గ్రామంలో జిల్లా పోలీసు కళాబృందాలు సోమవారం రాత్రి పలు సామాజిక రుగ్మతలపై ప్రజలకు అవగాహన కల్పించాయి. కార్యక్రమంలో ఎస్సై కుమారస్వామి గ్రామస్తులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో మహేందర్‌పై అదే గ్రామానికి చెందిన మహేశ్ దాడికి పాల్పడగా, మహేశ్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు.

విజయోత్సవాలతో ప్రజాధనం వృథా

మల్యాల: కాంగ్రెస్ పార్టీ ఈ నెల 14 నుంచి డిసెంబర్ 9 వరకు విజయోత్సవాలతో ప్రజా ధనం వృథా అవుతుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సత్యం అన్నారు. మల్యాలలో సోమవారం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను ముందుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేశం, గౌతమ్, రాజు, సాయికుమార్ పాల్గొన్నారు.

సమాచారం..

ప్రజాదర్బార్ రద్దు

జగిత్యాల: మున్సిపల్ కార్యాలయంలో ప్రతి మంగళవారం నిర్వహించే ప్రజాదర్బార్‌ను ఈ మంగళవారం రద్దు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఈ కార్యక్రమాన్ని రద్దు చేశామని, ప్రజలు గమనించాలని కోరారు.

నేడు నందగిరిలో విద్యుత్ అధికారుల పొలంబాట

పెగడపల్లి: మండలంలోని నందగిరిలో మంగళవారం విద్యుత్ అధికారుల పొలంబాట నిర్వహించనున్నట్లు గొల్లపల్లి డివిజన్ ట్రాన్స్‌కో ఏడీఈ వరుణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రైతులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని గ్రామాల్లో ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.